# మరో దేవత వెలిసింది

రచ్చబండ దగ్గర నలుగురూ జేరారు. రోజూ సాయంత్రం ఊరి పెద్దలు అక్కడ కూర్చుని లోకాభిరామాయణం ముచ్చటించుకోవడం పరిపాటి. అది మరీ చిన్న పల్లెటూరుకాదు. పెద్దపట్నమూ కాదూ. బస్తీ అని చెప్పవచ్చు. అందుకే ఆధునిక జీవితంలోకి అడుగు పెట్టున్నా పాతవాసనలను మాత్రం వదులుకోలేదు ఆఊరు. అలా వదలని పాత వాసనలతో రచ్చబండ దగ్గర సమావేశమయ్యే సాంప్రదాయం ఒకటి నిరాఘాటంగా సాగుతోంది.

"రావయ్యా... పంతులూ... రా.రా... ఇంకా రాలేదేమా అనిచూస్తున్నా ఏమిటి ఆలస్యం అయిందీ?" అన్నాడు రంగరాజు చేతిలో పేపరు పట్టుకువస్తున్న రాజారావు మాస్టార్ని చూస్తూ.

"ఏంలేదు రాజుగారూ. ఈరోజు స్కూల్‌కి ఇన్‌స్పెక్టర్ వచ్చారు. అందువల్ల ఆలస్యం అయింది." అన్నాడు రాజారావు చంకలోని పేపర్ని చేతిలోకి తీసుకుంటూ.

"తెలుగు వారిలో చదివే అలవాటు బాగా ఎక్కువ" అని ఒకసారి ప్రముఖ భారతీయ ఆంగ్లరచయిత ఆర్.కే నారాయణ్ అన్నారట. చదివే ఉత్సాహం ఎక్కువేనేమో కాని కొనే అలవాటు మాత్రం బాగా తక్కువ. ఇందుకు ఉదాహరణగా రంగరాజునే తీసుకోవచ్చు. ఆయన బాగా ఉన్నవాడు. ఇద్దరే కొడుకులు. ఇద్దరీ పెళ్ళికీ దండిగా కట్నం వసూలు చేశాడు. స్వతహాగా కూడా పుచ్చిపోయేటంత డబ్బు. ఇదికాక వడ్డీ వ్యాపారం మీద నెలనెలా వేలకి వేలు వస్తుంది. పొలాల మీద వచ్చే అయివేజు సరేసరి. అయితేనేం సొంత డబ్బులతో దిన పత్రిక తెప్పించుకోడానికి మనసొప్పదు. అలా అని వార్తలు అంటే ఉత్సాహం లేదా అంటే ఆయనకున్న ఆరాటం ఇంకెవరికీ లేదనే చెప్పాలి. వార్తలూ తెలుసుకోవాలి. తనసొమ్ము ఖర్చుకాకూడదు. అందువల్ల ఉభయతారకంగా రాజారావు చేత పేపరు చదివించుకోవడమో, ముఖ్యమైన వార్తలు ఆయన నోటినుంచి నివడమో చేస్తుంటాడు. రాజారావు ఆ ఊరిజిల్లా పరిషత్ హైస్కూల్‌లో టీచర్. స్కూల్‌కి వచ్చే దినపత్రికని తీసుకుని సాయంత్రంపూట రచ్చబండ దగ్గరకి వస్తుంటాడు. డబ్బు, పలుకుబడి వున్న రంగరాజుని మంచి చేసుకోడానికి ఈ పేపరు చిట్కా ఉపయోగిస్తుంటాడు. రోజూ రచ్చబండ దగ్గర రంగరాజు కాకుండా ఏడెనిమిది మంది జేరతారు. వారందరికీకూడా రాజారావు ఆలిండియా రేడియో. అతను చదివే పేపర్ల వార్తల మీద చర్చ మొదలై గంట గంటన్నర సేపు సాగాక, ఎవరిళ్ళకు వారు వెళ్తారు. అదే వారి దినచర్యలో ముఖ్య కార్యక్రమం. ఆ సమయానిక పెద్దవాన వస్తే తప్ప అది నిర్విఘ్నంగా కొనసాగవలసిందే.

రాజారావు కూర్చుంటూ "ఈరోజు పేపర్లో ఘోరమైన వార్త వచ్చింది రాజు గారూ" అన్నాడు.

"ఘోరమా! ఏదైనా విమానప్రమాదమా! రైలు ప్రమాదమా!" అని అడిగాడు రంగరాజు.

అందరూ కూడా ఆత్రంగా రాజారావు వంక చూడసాగారు.

"రాజస్థాన్‌లో రూప్‌కన్వర్ అనే అమ్మాయి, వేలమంది చూస్తుండగా చితిమీద కూర్చుని భర్త శవంతో పాటు సహగమనం చేసిందట. ఆమెను ఎవ్వరూ వారించలేదు సరికదా వేలమంది స్త్రీ పురుషులు "సతీమాతకీ జై" అని నినాదాలిస్తూ భజనలు చేశారట. ఆమెకి గుడికట్టి గ్రామదేవతగా ప్రతిష్టించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయట అన్నాడు" రాజారావు.

"ఎంత దారుణం! ఈ రోజుల్లోకూడా సహగమనము! పైగా దానిని అందరూ, అందులోనూ సాటి ఆడవారు కూడా ఘనంగా కీర్తించడమా! మనవారి మౌఢ్యానికి అంతం అంటూ ఉంటుందా అని అనిపిస్తోంది." అన్నాడు పంచాయితీ ఆఫీసులో పనిచేసే చలపతిరావు.

"మన ఊళ్ళల్లో గ్రామదేవతలలో చాలామటుకు ఈవిధంగా వెలిసినవే. అత్తలు, ఆడపడచుల ఆరళ్ళు భరించలేక ఆత్మహత్యలు చేసుకున్న లక్ష్మమ్మలూ, ఊరిక్షేమం కోసం చెరువుల్లోను, నదుల్లోను దూకిన ముసలమ్మలు - ఈవిధంగా గ్రామదేవతలుగా వెలిసినవారే. అందువల్ల సహగమనం చేసిన రూప్ కన్వర్ రేపు గ్రామదేవతగా వెలియడంలో ఆశ్చర్యం లేదు" అన్నాడు సహదేవ శాస్త్రి. ఆయన పి.డబ్ల్యు.డి.లో యు.డి.సి. పుస్తకాలు చదువుతుండడం అప్పుడప్పుడు పేపర్లకు వ్యాసాలు రాస్తుండడం అతగాడి హాబీ.

రంగరాజు కాలుస్తున్న చుట్టని నోట్లోంచి తీసి తుపుక్కునుమ్మాడు. చుట్టకి అంటివున్న బూడిదను దులిపాడు.

"నాకు తెలీకడుగుతా, ఆ అమ్మాయి కిష్టమై సహగమనం చేస్తే మిగిలిన వారికి బాధ ఎందుకంట?" అన్నాడు.

రంగరాజు ఆవిధంగా మాట్లాడ్డం చూసి అందరూ కొయ్యబారిపోయారు. అయితే ఆయన మోతుబరి కావడంతో ఎవరూ ధైర్యం చేసి నోరుమెదపలేక పోయారు. కొంచెంసేపు మౌనం పరిఢవిల్లింది.

కొంచెం సేపాగి సహదేవ శాస్త్రి గొంతు సవరించుకున్నారు.

"మీరు అనేది ఒకవిధంగా నిజమేననుకోండి. కాని మూర్ఖత్వం వల్లనో, అమాయకత్వం మూలంగానో, ఇలా సహగమనం పేరిట ఒక స్త్రీ ఆత్మహత్య చేసుకుంటుంటే సహించడమేనా? పసిపిల్లవాడి చేతికి మెరిసే కత్తినిచ్చి, దాన్ని చూసివాడు మురిసిపోయి, ఆడుకుందామనుకుని ప్రాణం తీసుకుంటుంటే చూస్తూ ఊరుకుంటామా? ఇదికూడా అంతే? భక్తిపారవశ్యంతోను, పాతివ్రత్యం అనుకునో ప్రాణాలు తీసుకుంటుంటే చూస్తూ ఊరుకోవడమేనా! మీవంటి పెద్దలు దాన్ని ఖండించాలి" అన్నాడు.

"పంతులూ .... ఒక్కమాట చెప్తాను విను. పుట్టిన ప్రతివాళ్ళు గిట్టక తప్పదయ్యా. పిన్నతనంలోనే ఏ పాముకాటువల్లనో, రోగం వచ్చో చచ్చిపోయారనుకో. అయినా చావు చావే, అవునా! చచ్చిపోయాక పదికాలల పాటు జనం గుర్తుంచుకునే అదృష్టం ఎందరికి ఉంటుందంటావు? తాను సహగమనం చేసి అమరజీవి అయింది రూప్ కన్వర్. కానీ ..... మంచిదే" అన్నాడు రంగరాజు.

ఇంక ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ఆయనతో వాదించడం అనవసరం.

ఆ తర్వాత చర్చ వేరే విషయాల మీదికి వెళ్ళింది. కొంతసేపయ్యాక ఎవరి దారిన వారు వెళ్ళారు.

* * *

"రా.... అమ్మా ..... రా ..... ఏమిటీ ఉత్తరం ముక్క కూడా రాయకుండా ఇలా వచ్చేశావు? వంట్లో కులాసాగా ఉంటోందా?" అంటూ ఎదురు వెళ్ళాడు రామగోపాలం.

"అదే కులాసాలే నాన్నా" అంటూ లోనికి వెళ్ళింది సావిత్రి.

"ఇదుగో అమ్మాయి వచ్చింది" అంటూ భార్యకి వినిపించేటట్లుగా గట్టిగా అరిచాడు ఆయన.

"సావిత్రీ" అంటూ వడివడిగా ఎదురొచ్చి కూతుర్ని కౌగిలించుకుంది సీతమ్మ. తల్లిని చూడగానే దుఃఖం కట్టలు తెంచుకుంది సావిత్రికి. తల్లిని వాటేసుకుని "అమ్మా ... అమ్మా...." అంటూ వెక్కి వెక్కి ఏడవసాగింది.

"ఏమ్మా .... మీ అత్తమామలు మళ్ళీ సాధిస్తున్నారా అమ్మా?" అన్నాడు రామగోపాలం దిగులుగా.

"ఇంకేముంటుంది ముదనష్టపాళ్ళకి .... నాబిడ్డ ఉసురుపోసుకు చస్తారు" అంటూ మెటికలు విరిచింది సీతమ్మ.

"మొన్ననే కాదమ్మా కట్నం బాకీ అంటే పదివేలు పంపించాను. గట్టిగా నాలుగు నెలలు కాలేదు. మళ్ళీ ఏమొచ్చింది?" అన్నాడు రామగోపాలం అసహ్యం, బాధ మిళితమైన స్వరంతో.

"ఈ మధ్యన మామరిదికి పెళ్ళయిందిగా నాన్నా మాతోటి కోడలు ఇంకా పదివేలు ఎక్కువ కట్నం తెచ్చిందట. నన్నూ మరో పదివేలు తీసుకురమ్మనీ, లేకుంటే తిరిగి ఇంట్లో అడుగు పెట్టవద్దని తిట్టి కొట్టి పంపించేశారు నాన్నా" అంటూ భోరున విలపించింది సావిత్రి.

"దుర్మార్గుడు డబ్బు పుచ్చిపోతోంది. పోయేటప్పుడు కట్టుకు పోతాడా?" అంటూ పళ్ళు పటపట కొరికాడు రామగోపాలం.

"అయినా నీపెళ్ళి ఐదేళ్ళ క్రిందటి మాట. అప్పుడు మనం ఇచ్చిన కట్నం ఘనమైనదే. పైగా మీ ఆయన పెద్ద చదువుకున్నవాడూ కాదు. మీ మరిదేమో పట్నంలో పెద్ద చదువులు చదువుకున్నవాడు. మరి అతనికి ఎక్కువ కట్నం రావడంతో ఆశ్చర్యమేముంది? అతనితో వంతు పెట్టుకుని ఇప్పుడు అంత కట్నం తెమ్మంటే ఎక్కడ చస్తాం?" అంది సీతమ్మ గారు.

"నిజమేనమ్మా. కాని ఆమాట అనేదెవరు? అడిగేదెవరు?" అంది సావిత్రి.

"సరే, చచ్చిచెడి ఆ పదివేలు కూడా తెచ్చి ఇచ్చాననుకో. అప్పుడు పెద్దకోడలు ఇంత కట్నం తెచ్చింది. నువ్వు ఇంకా ఎక్కువ తేవాలి అంటూ చిన్నకోడల్ని బాధపెట్టరూ?" అన్నాడు రామగోపాలం.

"అంతేనా .... అప్పుడు వాళ్ళ చిన్నకోడలు ఇంతెక్కువ తెచ్చింది. నువ్వూ అంతే ఇవ్వాలి అంటూ రొట్టెమీద నెయ్యి.నేతిమీద రొట్టెలాగా నిత్యమూ ఇద్దర్నీ పిండుతూ ఉంటారు" అంది సీతమ్మ.

"అమ్మా .... ఈపదివేలు తీసుకురాకపోతే నన్ను వదిలేస్తారట. విడాకులు ఇప్పించి కొడుక్కు మళ్ళీ పెళ్ళి చేస్తారట" అంది సావిత్రి ఏడుస్తూ.

"ఆ రోగిష్టి వాడికి అదొక్కటే తక్కువమయింది. మన అల్లుడని అనుకోకూడదు కాని మనిషికేమైన ఆరోగ్యమా పాడా? ఎప్పుడూ ఏదో ఒక సుస్తీయే. మంచం వదలడు. ఇంతవరకు పిల్లాలేదు, పాపాలేదు" అన్నాడు రామగోపాలం కసిగా.

"మాయదారి వాళ్ళు, శవానికి కూడా కట్టబెట్టి కట్నం వసూలు చేసేరకం. వీళ్ళ చావెప్పుడు వస్తుందో!" అంది సీతమ్మ.

"నువ్వు బాధపడకులే తల్లీ. మీ అత్తమామలతో నేను మాట్లాడి ఏదో ఏర్పాటు చేస్తాను. స్నానం చేసిరా భోజనం చేద్దుగాని. ఎప్పుడు తిన్నావో ఏమో!" అన్నాడు రామగోపాలం.

తలతాకట్టు పెట్టి మరో ఐదువేలు తెచ్చి వియ్యంకుడి చేతిలో పోశాడు రామగోపాలం. దాంతో సరిపెట్టుకోమనీ, తన కూతురుకి అన్యాయం చెయ్యొద్దని కాళ్ళావేళ్ళా పడి బతిమలాడాడు. కాదంటే అదికూడారాదని గ్రహించి అయిష్టంగానే తీసుకుని కోడలిని లోపలికి రానిచ్చాడు రంగరాజు.

నాలుగు నెలలు గడిచాయి.

నిత్యరోగి అయిన సావిత్రి మొగుడు మాధవయ్యకి రోగం తిరగబెట్టింది. నాలుగు రోజులు తీసుకుని కన్నుమూసాడు.

రామగోపాలానికీ, సీతమ్మకీ అల్లుడు పోయిన విషయం కబురుకూడా చేయలేదు రంగరాజు. భార్యతో ఏదో గుసగుస లాడాడు.

అత్తమామలు సావిత్రిని తమ గదిలోకి పిలిచారు.

"సావిత్రీ ..... పేరుకి తగ్గట్లు నువ్వు పతివ్రతవే. ఆకాలంలో సావిత్రి పతి ప్రాణం తెచ్చుకోగలిగింది. కాని ఇది కలికాలం. నువ్వు ఆపని చేయలేవు. అందువల్ల ఒక పతివ్రతగా నీపేరు సార్థకం అయ్యేటట్లు, నీ భర్త శవంతో పాటు నువ్వుకూడా సహగమనం చెయ్యి. నీపేరు శాశ్వతంగా నిలుస్తుంది. నీకు జనం గుళ్ళుకూడా కట్తారు. జీవితానికేముంది? ఎప్పటికైనా పోయేదే.' ' అన్నాడు రంగరాజు అతిశాంతంగా.

"భర్తపోయిన ఆడదాని బ్రతుకు నీకు తెలిసిందేగా. అంతకన్నా చచ్చిపోవడం నయం. ఇక్కడ నీకు స్థానంలేదు, పుట్టింటికి నువ్వు భారం. నువ్వు ఉండలేవు. వాళ్ళు ఉంచుకోలేరు ఆలోచించుకో" అంది అత్తగారు.

సావిత్రి నిర్ఘాంతపోయింది. నోటమాట రాలేదు. ఒక్కసారి భర్త ముఖంవైపు చూసింది. తర్వాత అత్తమామల వంక చూసింది. ఆమె మనోభావాన్ని కన్నీరు కప్పేసింది. మౌనం అంగీకార సూచకం ఇంకేం కావాలి.

మాధవయ్య శవయాత్ర మొదలైంది. మోతుబరిగారి అబ్బాయి కనుక జనం బోలెడుమంది వచ్చారు.

చితి తయారయింది. శవాన్ని చితిపై పడుకోబెట్టారు.

ఉన్నట్లుండి సావిత్రి చకచకా చితి దగ్గరకి వెళ్ళింది. చితిపైకి ఎక్కి భర్త తలని ఒళ్ళో పెట్టుకుంది.

జనం విభ్రాంతి నుంచి తేరుకునేలోగానే చితికి నిప్పంటించేశారు.

"పతివ్రతకీ జై" అన్న నినాదాల మధ్య చూస్తుండగా బూడిదైపోయింది సావిత్రి.

సావిత్రి సహగమనం చేసిన చోట "సావిత్రి గుడి" వెలసింది. భక్తులు ఘనంగా చందాలు వేసి కట్టించారు. దానికి ధర్మకర్తా, పూజారీలెవరోకాదు. సాక్షాత్తూ రంగరాజే నెలపొడవునా భక్తులు అందించే కానుకలు వేల రూపాయల్లో ఉంటున్నాయి. మాధవయ్య బ్రతికివుంటే సావిత్రిని పీడించి వారు ఐదువేలు పిండేవారేమో! కాని సావిత్రి చచ్చిపోయి మామగారికి వేలకు వేలు గుమ్మరిస్తోంది.

ఏమైతేనేమీ. ఆ ఊరిలో మరో దేవత గుడి వెలిసింది.

*(జాగృతి, ప్రత్యేక సంచిక 1990)*